నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రాజన్న సిరిసిల్ల

మంగళవారం 28 నవంబర్ 2023
TUESDAY, NOVEMBER 28, 2023 | RAJANNA SIRCILLA | 3


## నేడు సిరిసిల్లలో
# కేటీఆర్ రోడ్ షో

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం కార్మిక క్షేత్రమైన సిరిసిల్లకు రానున్నారు. కామారెడ్డి జిల్లాలో ఎన్నికల ప్రచారం ముగించుకుని మధ్యాహ్నం రెండు గంటలకు సిరిసిల్ల పట్టణానికి చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పట్టణంలో నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. అమాత్యుడి రోడ్‌షో సందర్భంగా పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**- రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)**

## అభివృద్ధిని చూడండి.. ఆశీర్వదించండి

మీరు గెలిపిస్తే ఎమ్మెల్యేను అయిన. కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రినైన. ఈ ప్రాంతాన్ని తలఎత్తుకొనేలా అభివృద్ధి చేసిన. నాడు సిరిసిల్ల నియోజకవర్గం ఎట్లుండే.. నేడు ఎట్లయిందో.. కండ్ల ముందే ఉన్నది చూడండి. ఆలోచించి ఓటు వేయండి. మరోసారి నన్ను ఆశీర్వదించండి. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్త. **- మంత్రి కేటీఆర్**



# కారు.. టాప్‌గేర్

## ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్

- అధినేత కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్
- సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో మంత్రి కేటీఆర్ రోడ్ షోలు సూపర్ హిట్
- ఆలోచింపజేసిన ముఖ్యమంత్రి, రామన్న ప్రసంగాలు
- అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని పిలుపు
- అభ్యర్థులు రామన్న, చల్మెడకు జైకొడుతున్న ప్రజానీకం
- మరోసారి పట్టంకడుతామంటూ మద్దతు
- గులాబీ శ్రేణుల్లో ఫుల్ జోష్

సిరిసిల్ల జిల్లాలో కారు జోరుమీదున్నది. పల్లె, పట్నం అనే తేడా లేకుండా టాప్‌గేర్‌లో దూసుకెళ్తున్నది. ఓవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజా ఆశీర్వద సభలు.. మరోవైపు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ రోడ్‌షోలతో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరెత్తుత్తున్నది. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధి, ప్రతిపక్షాలకు అవకాశమిస్తే జరిగే నష్టంపై ముఖ్యమంత్రి కేసీఆర్, అమాత్యుడు రామన్న ప్రసంగాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుండగా, అంతటా మద్దతు పెరుగుతున్నది. అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలన్న పిలుపుతో సిరిసిల్ల, వేములవాడ అభ్యర్థులు కేటీఆర్, చల్మెడ లక్ష్మీనరసింహారావుకు ప్రజానీకం జైకొడుతుండగా, గులాబీ శ్రేణుల్లో గెలుపుధీమా కనిపిస్తున్నది.

**-సిరిసిల్ల/ వేములవాడ, నవంబర్ 27**

.. వివరాలు 11లో

# ఒక్క ఓటూ మిస్‌కావొద్దు

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్**

**బూత్‌ల వారీగా బీఆర్ఎస్ శ్రేణులతో సమీక్ష**



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

.. 12లో



# ష్.. గప్‌చుప్

## నేటి సాయంత్రం నుంచి ప్రచారం బంద్

అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వానికి నేడు తెరపడనున్నది. దాదాపు నెల రోజుల నుంచి హోరాహోరీగా సాగుతున్న క్యాంపెయిన్, మంగళవారం సాయంత్రం 5 గంటలకు బంద్ కానున్నది. గురువారం పోలింగ్ నేపథ్యంలో 48 గంటల ముందే ఓట్ల అభ్యర్థన నిలిపి వేయాల్సి ఉండగా, జిల్లాల వారీగా యంత్రాంగం మరింత నజర్ పెట్టింది. ఎల్లుండి పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నది. నేటి సాయంత్రం 5గంటల నుంచి డిసెంబర్ ఒకటో తేదీ ఉదయం 7గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నది. ఇటు సోమవారం ఎక్కడికక్కడ ప్రచారం హోరెత్తింది.

**- రాజన్న సిరిసిల్ల, నవంబర్ (నమస్తే తెలంగాణ)**

## వాళ్లత్తె భూమి ఇడ్సిపెట్టుడే అయితది

మా తండ్రులు, తాతల నుంచి ఎవుసమే జేత్తన్నం. ఆ దినాల్లో సర్పంచుల కన్నా ఎక్కువ పట్వారీలే పెత్తనం చెలాయించిన్రు. మాతాతల పేరిట ఉన్న భూమిని మా పేరుమీద చేయించుకునేందుకు కొన్ని తిప్పలు పడలేదు. ఎమ్మార్వో ఆఫీసుకు పోవాలంటే పొద్దుగాల బయలెల్లితే ఎములాడకు పోయేసరికి తిండాళ్లయితండే. ఆడికి పోతే సార్ లేడంటే మళ్లో రోజు. గిట్ల పదిసార్లు తిరిగితే గాని పని కాలేదు. నలుగురిని తీసుకుని పోవాలంటే వట్టిగయితదా. నాడు గీ హోటళ్లు లేవు. సద్దులు గట్టుకుని పోయేటోళ్లం. కేసీఆర్ సార్ వచ్చినంక ధరణి తెచ్చిన్రు. మా పొలగాళ్ల మీద పేరు మార్చుకుంటే అరగంటనే పట్టింది. ఫొటో తీసిన్రు. పట్టా పాసుబుక్కు చేతిలో పెట్టిన్రు. చాలా తొందరగా అయిపోయింది. గింత మంచిగున్న ధరణిని వద్దని చెప్పే కాంగ్రెసోళ్లకు ఏమన్న బుద్ధుందా..? ఇగ అట్లనే రైతుబంధు యజమానికో.. కౌలుదారుకో ఇస్తమని మళ్లో పంచాయతీ షురూ చేసిన్రు. ఇట్ల ఆగం చేసుడు సరికాదు. ఇప్పుడు ఏకంగా రైతుబంధు పైసలు పడకుంట చేసిన్రట? ఈళ్లేం మనుషులు గింత ఘోరమా..? వీళ్లొస్తే.. ఉన్న భూమిని ఇడిసిపెట్టి కూలినాలీ చేస్కొని బతకాల్సి వత్తది. అందుకే వాళ్లు రావద్దు.. వాళ్ల పాలన మనకొద్దు. కాంగ్రెస్సోళ్లు రైతులపై కక్షకట్టిన్రు

**- చిట్ల మల్లయ్య, రైతు, అనుపురం (రాజన్న సిరిసిల్ల)**



## కాంగ్రెస్‌ను నమ్మితే
# భూములు ఖతమే

- పథకాలు పోతయ్.. జీవితాలు ఆగమైతయ్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతాంగం
- హస్తం పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరిక
- రైతుబిడ్డ కేసీఆర్‌కు అండగా ఉంటామని స్పష్టీకరణ



మధ్యపేజీలో..

రైతులపై కాంగ్రెస్ కక్షగట్టిందా..? సంతోషంగా ఉన్న అన్నదాతలపై కుట్రలు చేస్తున్నదా..? అంటే కర్షకలోకం నుంచి అవుననే సమాధానం వస్తున్నది. ఓవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోంటే.. హస్తం పార్టీ మాత్రం వక్రబుద్ధి చూపుతున్నట్టు స్పష్టమవుతున్నది. ఆ పార్టీ నాయకులు తలోరీతిన అనుచిత వ్యాఖ్యలు చేయడం, 24 గంటల కరెంట్, ధరణి పోర్టల్, రైతుబంధును లక్ష్యంగా చేసుకుని విషం కక్కడం రైతులను తీవ్రంగా కలచివేస్తున్నది. ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తామనడం, టెన్ హెచ్‌పీ మోటర్లు వాడితే మూడు గంటల కరెంట్ సరిపోతుందనడం, ఎక్కడికెళ్లినా ఇదే మాట్లాడుతుండడం, తాజాగా రైతు బంధును ఆపించడంతో రైతులోకం భగ్గుమంటున్నది. తప్పిపోయి కాంగ్రెస్ వస్తే ఆ ప్రభావం ముందుగా రైతులపైనే పడుతుందని, భూములు ఖతమవుతాయని మండిపడుతున్నది. ధరణిని ఎత్తివేసినా.. పాత వ్యవస్థ వచ్చినా.. ఉచిత కరెంట్ పోయినా.. రైతుబంధు ఆగినా.. ఎక్కడికక్కడ ధరలు పడిపోతాయని, సాగు విస్తీర్ణం తగ్గి ఆగం కావల్సి వస్తుందని భయపడుతున్నది. మళ్లీ కథ మొదటికి వస్తుందని, గ్రామీణ వ్యవస్థ నాశనమై మళ్లీ వలసలు మొదలవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అధికారంలోకి రాక ముందే ఇన్ని కుట్రలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నది. ఎవుసాన్ని పండుగలా చేసి, తమకు అండగా నిలుస్తున్న రైతుబిడ్డ కేసీఆర్‌నే మరోసారి గెలిపించుకుంటామని స్పష్టం చేస్తున్నది.

**-రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)**